క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సృజనవాణి సంస్థ సమన్వయకర్త కె.జానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లొమా, నర్సింగ్, బీఈడీ, డీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న వారికి స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. దీనికోసం హెచ్‌టీటీపీఎస్.స్కాలర్‌షిప్‌సృజనవాణి.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 7989947349, 9618074436 సంప్రదించాలని కోరారు.

కలుపు నివారణపై దృష్టి సారించాలి

మాకవరపాలెం: కలుపు నివారణపై రైతులు దృష్టి సారించాలని ఏవో చిరంజీవి సూచించారు. మండలంలో వరినాట్లు వేసి సుమారు 20 రోజులు గడుస్తున్న నేపథ్యంలో పొలాల్లో కలుపు అధికంగా ఉంటుందన్నారు. దీని నివారణకు 80–100 ఎంఎల్ బిస్ ఫైరిబ్యాక్, 8 గ్రాముల ఆల్‌మిక్స్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా 20 రోజుల లోపు ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున కాలిబాటలు తీసుకోవాలన్నారు. దీని వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గి, పంటకు గాలి ప్రసరణతోపాటు మందుల పిచికారీకి వీలుగా ఉంటుందన్నారు.

కొత్తకోట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభాకర్



రావికమతం: కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎ.వి.ఎస్ ప్రభాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సాయి కుమార్‌కు భీమునిపట్నం బదిలీ కావడంతో రోలుగుంట కళాశాల నుంచి ప్రభాకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

వెల్‌నెస్ కేంద్రం పరిశీలన



వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: సత్యవరంలో వెల్‌నెస్ కేంద్రాన్ని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేస్తుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులు దాదాపు పూర్తి కావస్తుండటంతో త్వరలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడితో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాళ్ల రాజు, శనివాడ వెంకటరమణ, గోకేడ ఈశ్వరరావు, చల్లా మహేష్, ఎడ్ల మహేష్, జాజుల ఈశ్వరరావు, పెంటకోట చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌లో చురుగ్గా నాచు తొలగింపు



దాలివలస కెనాల్ మార్గంలో పనులు చేస్తున్న లస్కర్లు

కె.కోటపాడు: మండలంలోని రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కల తొలగింపు పనులను జీవీఎంసీకి చెందిన లస్కర్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. కెనాల్ మార్గంలో నీటి అడుగు భాగంలో పెద్ద ఎత్తున నాచు, మొక్కలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో రోజూ విశాఖపట్నానికి వెళ్లాల్సిన 50 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ఉండేందుకు లస్కర్లతో వీటి తొలగింపు చర్యలు చేపడుతున్నారు. దాలివలస–గవరపాలెం మార్గంలో ఆదివారం ఈ పనులు చురుగ్గా నిర్వహించారు.

దేవరాపల్లిలో నేత్ర వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: స్థానిక రామాలయం వద్ద సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా తాతలకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నేత్ర పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరానికి హాజరు కావాలని కోరారు.

బంగారు 'బాట'

- బండారుపాలేనికి బీటీరోడ్డు నిర్మాణం
- డిప్యూటీ సీఎం బూడి చొరవతో తీరిన రవాణా కష్టాలు
- రూ. 87 లక్షలతో 1.51 కి.మీ మేర తారురోడ్డు పనులు



తుది దశలో తారురోడ్డు నిర్మాణ పనులు



తారురోడ్డుగా రూపుదిద్దుకున్న బండారుపాలెం రహదారి

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో కలిగొట్ల శివారు బండారుపాలెం గ్రామానికి రవాణా కష్టాలు తొలగాయి. దశాబ్దాలుగా వేధిస్తున్న ఈ రహదారి సమస్య పరిష్కారానికి రూ. 87 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో కలిగొట్ల–అర్జునగిరి తారురోడ్డు నుంచి బండారుపాలెంకు 1.51 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు.

గతంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే స్థానికులు నానా అవస్థలు పడేవారు. వర్షాకాలంలో బురదమయంగా మారిన ఈ రోడ్డులో వృద్ధులు, మహిళలు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. కనీసం కాలి నడకన సైతం వెళ్లలేని దుస్థితి. అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి 108 వాహనం వచ్చే పరిస్థితి లేక పోవడంతో ఎడ్లబండిపైనే తీసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితులు ఉండేవి. ఈ రోడ్డు నిర్మించాలని ఎన్నో యేళ్లుగా ఆయా ప్రభుత్వాల్లో ప్రజాప్రతినిధులకు అధికారులకు గ్రామస్తులంతా వేడుకున్నా ఫలితం లేకపోయింది. గత టీడీపీ హయాంలోనూ ఆపార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లిన కనీసం గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గతంలో ఎంపీపీ హోదాలో ఈ రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు చేయగా, రోడ్డు విస్తరణకు స్థానిక రైతులు కొందరు సహకరించలేదు. తాజాగా వారే ఈ రోడ్డు నిర్మించాలని డిప్యూటీ సీఎంను కోరగా, తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో బండారుపాలెంతోపాటు గొర్రుపోటు కల్లాలు, యాళ్ల వారి కల్లాలు, దొగ్గ వారి కల్లాల రైతులకు రహదారి కష్టాలు తీరాయి. దశాబ్దాల కలను నెరవేర్చిన ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

తారురోడ్డు చూస్తాననుకోలేదు..



నేను బతికి ఉండగా మా గ్రామానికి తారురోడ్డు చూస్తాననుకోలేదు. ఇప్పటి వరకు 104, 108 వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం భుజం పైన, ఎడ్ల బండ్లపైన తీసుకెళ్లాల్సిన పరిస్థితి. నాలుగు సార్లు వార్డు మెంబర్‌గా పనిచేసిన నేను ఎన్నోమార్లు ఎందరో నాయకులను రోడ్డు కోసం వేడుకున్నా పట్టించుకోలేదు.

– బండారు ఎర్రయ్యమ్మ, వార్డు మాజీ మెంబర్, బండారుపాలెం

డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు



కలిగొట్ల గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు. ఇప్పటికే గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయినీరు, సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేశారు. గత ప్రభుత్వాలు బండారుపాలెం రహదారి సమస్యను పట్టించుకోలేదు. డిప్యూటీ సీఎం చొరవతో తారురోడ్డు నిర్మించి రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించారు.

– గొర్రుపోటు సుధారాణి, సర్పంచ్, కలిగొట్ల

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



హెచ్‌ఎంను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు 200 కంచాలతోపాటు కంప్యూటర్ టేబుల్‌ను వితరణగా అందించారు. ఇక్కడ 2002–03లో పదో తరగతి చదివిన వీరంతా ఆపై ఉన్నత చదువులు పూర్తి చేసుకుని వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు తమవంతు సహకారంగా సొంత నిధులతో వీటిని సమకూర్చారు. అనంతరం హెచ్‌ఎం రామకృష్ణను దుశ్శాలువాతో సత్కరించారు. పాఠశాలకు ఏ అవసరమున్నా తమవంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

వి.వి.అగ్రహారంలో చురుగ్గా సీసీరోడ్డు పనులు



సీసీరోడ్డు నిర్మాణ పనులు

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో సీసీరోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బంగారుమెట్ట మార్గంలోని ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా రూ.2 కోట్లతో నిర్మిస్తున్నారు. వి.వి.అగ్రహారం పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో సీసీరోడ్డు పనులు చేపట్టారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యాలయం నుంచి ఈ పనులు చేపట్టడంతో గతంలో అధ్వానంగా ఉన్న రహదారి రూపురేఖలు మారాయి. గ్రామంలో పలు అంతర్గత రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఆలయ నిర్మాణ పనులు పునఃప్రారంభం నేడు



ఉప సర్పంచ్ కరక అప్పలరాజు

నాతవరం: ఈరుడి కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులు సోమవారం నుంచి పునః ప్రారంభిస్తామని ఆలయ కమిటీ చైర్మన్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఆదివారం తెలిపారు. ఇక్కడ భక్తుల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దివంగత అంకంరెడ్డి జమీలు ఈ ఆలయ నిర్మాణం ప్రారంభించారన్నారు. గతేడాది ఆయన మరణంతో ఆలయ పనులు నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో కొంకోట మారుతి సిద్ధాంతి సూచనల మేరకు గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో పనులు పునః ప్రారంభించి దాతల సాయంతో పూర్తి చేస్తామన్నారు. ఈ మేరు ఆలయానికి ద్వార బంధం ఏర్పాటు చేయడానికి నిర్ణయించామన్నారు.

మదుముల ఏర్పాటుతో ప్రమాదాలకు చెక్



రోలుగుంటలో మదుముల ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్

రోలుగుంట: భీమునిపట్నం–నర్సీపట్నం రోడ్డులో శిథిలమైన మదుములు తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. దాంతో ఈ రోడ్డులో తరచూ చోటు చేసుకునే ప్రమాదాలకు చెక్ పెట్టునట్టయిందని వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రెండు దశాబ్దాల క్రితం నాటి మదుములు కావడంతో పూర్తిగా శిథిలమయ్యాయి. అసలే ఇరుకు రోడ్డు, ఆపై దెబ్బతిన్న మదుములతో నిత్యం రాకపోకల సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఈ సమస్య పరిష్కారం కోసం రెండు మాసాల క్రితం మదుములు తొలగించి, కొత్తవి ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం దాటిన తర్వాత చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం సరిహద్దు వెలంకాయలపాలెం నుంచి రావికమతం మండలం కొత్తకోట గజాల కట్టు వరకూ రెండు రోజులుగా తొలగించిన శిథిల మదుముల స్థానంలో పొక్లెయిన్‌తో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



పూజల్లో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు

మాకవరపాలెం: సరస్వతీదేవికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా ఆదివారం స్థానిక రామాలయంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామానికి చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు సైతం పాల్గొని సరస్వతీ దేవికి విశేష పూజలు చేశారు.

వరినాట్లకు ఊపిరి పోసిన వర్షం



కొత్తకోటలో పొలంలో చేరిన నీరు

రావికమతం: గడిచిన కొన్ని రోజులుగా వర్షాలు లేక పోవడం, పైగా మండే ఎండలు కాయడంతో ఇప్పటికే వరినాట్లు పడిన రావికమతం, కొత్తకోట, దొండపూడి, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, గుడ్డిప తదితర గ్రామాల్లో వరిపొలాలు ఎండిపోయి కనిపించేవి. శనివారం కురిసిన వర్షానికి ఆయా పొలాల్లో కొద్ది కొద్దిగా వర్షపు నీరు చేరడంతో కాస్త ఊపిరి పోసుకున్నాయి. మరలా రెండు మూడు రోజులలో అడపాదడపా జల్లులు పడకపోతే ఈ నీరు రెండు రోజుల ఎండలకే ఇంకిపోతుంది. చెరువులు నిండే వర్షం కురవకపోతే ఇబ్బందులేనని పలు గ్రామాల రైతులు చెబుతున్నారు.

ప్రశ్నించే తత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గంగరాజు



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

అనకాపల్లిటౌన్ : సంపూర్ణ విషయ పరిజ్ఞానంతో ప్రశ్నించేతత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో మండల న్యాయసేవా అధికార సంస్థ, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్యనైనా రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, అందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. వివాదాల పరిష్కారానికి ప్రభావంతమైన సాధనం లోక్ అదాలత్ అని అభివర్ణించారు. అల్పాదాయవర్గాల ప్రజలకు లోక్ అదాలత్ ఉచిత న్యాయసహాయం చేస్తుందన్నారు. న్యాయస్థానం లేదా వ్యాజ్యానికి ముందు పెండింగ్ దశలో ఉన్న వివాదాలు/కేసులను సామరస్యంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొని, రాజీ చేసుకునే అవకాశముందన్నారు. రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బి.వి.విజయలక్ష్మి, మూడో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్‌లు మాట్లాడుతూ సత్వర న్యాయానికి, న్యాయసహాయానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ అందుబాటులో న్యాయాన్ని ఉంచడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. అంతకుముందు న్యాయమూర్తులను గ్రంథాలయ సభ్యులు ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనశిక్షణాసంస్థాన్ డైరెక్టర్ చొక్కాకుల అప్పలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, సభ్యులు బొడ్డేడ జగ్గ అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ, టైలరింగ్ శిక్షకురాలు రాపేటి ప్రేమలత పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



గరగల ఊరేగింపును ప్రారంభిస్తున్న సీఐ మోహనరావు

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అన్నారు. స్థానిక కోట్నీవీధి మరిడిమాంబ గరగల ఊరేగింపును ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు ఖాళీ సమయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. 84వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నేత కోరుకొండ రాఘవ మాట్లాడుతూ ఈనెల 31న అమ్మవారి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోట్నీ శ్రీనివాసరావు వెంకట పద్మ, కుమారులు యశ్వంత్ సాయి, పెద్దేటి యమున ఆర్థిక సహకారంతో అమ్మవారి రథయాత్ర కూడా నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్నీ శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ అప్పికొండ రవిశంకర్, రాఘవ మిత్ర మండలి సభ్యులు తలారి లక్ష్మీప్రసాద్, కోరుకొండ వాసు, సీతారామరాజు, కె.నాగరాజు, లకిడపు స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంత జీవన విధానం



ప్రజలకు గొడుగులు అందజేస్తున్న న్యాయమూర్తి శివకిరణ్

అనకాపల్లిటౌన్ : ధ్యానం ద్వారా ప్రశాంతమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని థర్డ్ అడిషనల్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్రా మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం ఆదివారం ఆయన గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా వల్ల ఒక్కరిలో ఆలోచనా విధానం మెరుగుపడుతుందన్నారు. ఈ ఆలోచనా విధానం ద్వారా భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఏర్పడుతుందని సూచించారు. స్నేహితులు, కుటుంబ బాంధవ్యాలు పెరుగుతాయన్నారు. ఇటువంటి ప్రశాంతమైన జీవన విధానం ద్వారా నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.చిట్టిబాబు, రాంబిల్లి డీటీ వి.శేషుబాబు, కేంద్రం కో ఆర్డినేటర్ కోలపర్తి జయబాబు, సభ్యులు కె.వి.కె.రావు, జి.మంగయ్య పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

మునగపాక: ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మప్రచారకులు ఆడారి గంగాధర్ కోరారు. మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తనతో పాటు భక్తి గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. రోజులో అరగంట పాటు వ్యాయామం చేయాలన్నారు. గ్రామంలోని భజన బృందాలను కలుపుకొని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చంద్ర మాలకొండయ్య, సిరియాల సత్యనారాయణ, సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ, కొణతాల వెంకటరావు, కర్రి వాసు పాల్గొన్నారు.

మన్యంలో లాభాల సాగు



చిలగడ దుంపల సాగు



మిరప పంట

- విస్తారంగా చిలగడ దుంపల పంట
- పెరుగుతున్న క్యారెట్ సాగు విస్తీర్ణం
- మిరపకు డిమాండ్



చింతపల్లిలో క్యారెట్ పంట

దంత్రిగుడ: జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో పాటు వాణిజ్య పంటల సాగు విస్తారంగా పండిస్తున్నారు. ఏజెన్సీలో పండించే పంటలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. ఇక్కడ పండించే కాఫీ, పసుపు, మిరియాలు తదితర పంటలు దేశంలో వివిధ ప్రాంతాల్లో రవాణా జరుగుతోంది. మార్కెట్ బాగుండడంతో గిరిజన రైతులు ఏటా సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో క్యారెట్, క్యాబేజీ, వంగతో పాటు చిలగడ దుంపలు, మిరప సాగు విస్తారంగా పండిస్తున్నారు.

మంచి ధరలతో లాభాలు

మండలంలోని 18 పంచాయతీల్లో కూడా గిరిజన రైతులు ఈ ఏడాదిలో చిలగడ దుంపల పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. మండలంలోని సొవ్వ, గసభ, కొర్రాయి, కోల్లాపుట్టు ,గుంటసీమ ,అరమ తదితర పంచాయతీల్లో చిలగడ దుంపల పంటలను విస్తారంగా పండిస్తున్నారు. మండల వ్యాప్తంగా గత ఏడాదిలో 120 ఎకరాల్లో పండిస్తే ఈ ఏడాదిలో మాత్రం 235 ఎకరాల్లో పంటలను విస్తరించినట్టు అధికారులు అంటున్నారు. గత ఏడాదిలో 50 కిలోల బస్తా రూ.700 నుంచి రూ.900 వరకు ధర పలుకుతోంది. ఆయా ప్రాంతాల్లోని సంతలకు మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి చిలగడ దుంపలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు బాగున్నాయని మరింత పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా క్యారెట్ దిగుబడి

చింతపల్లిరూరల్: మండంలో సుమారు గత ఏడాది ఈ–క్రాప్ బట్టి 232 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో క్యారెట్ సుమారు 45 ఏకరాల్లో పండిస్తున్నారు. మండలంలోని చౌడుపల్లి, లోతుగెడ్డ, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో క్యారెట్ ఎక్కువగా పండిస్తున్నారు. వాతావరణం, నేలా అనుకూలించడం వలన దిగుబడి మంచిగా ఉందని రైతులు చెబుతున్నారు.మార్కెట్‌లో కుడా మంచి ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు సంతలకు వచ్చి కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. సుమారు కిలో రూ.40 నుంచి రూ.50 ల మధ్య విక్రయిస్తున్నారు.

మిరపలో హైబ్రిడ్ రకాలు మేలు

చింతపల్లి: గిరిజన రైతులు హైబ్రిడ్ మిరప రకాలు సాగుచేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వివిధ రకాల కూరగాయలతో పాటు మిరపను కూడా సాగు చేస్తున్న రైతులు అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రిడ్ రకాలు ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాల్లో మిరపను వాణిజ్యపరంగా సాగుచేస్తున్నారని శాస్త్రవేత్త శివకుమార్ తెలిపారు. అన్‌మోల్, బి.ఎస్.ఎస్–273 రకాలు మంచి దిగుబడులు ఇస్తున్నట్టు పరిశోధనలో వెల్లడైనట్టు ఆయన తెలిపారు. గతంలో భాస్కర్, సిందూర, కిరణ్, భాగ్యలక్ష్మి వంటి రకాలను గిరిజనులు సాగుచేశారని తెలిపారు. మిరప పంటలో చీడపురుగుల నియంత్రణకు మొక్కజొన్న పంటగా వేస్తారు.

400 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 262 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 97 మందికి మందులు అందజేశారు. 52 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 15 మంది రక్తాన్ని దానం చేశారు. ఆయా శిబిరాలకు విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయం కల్పించారు. శిబిరాలను సందర్శించిన బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడారు.

31న మరిడిమాంబ పండగ

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఈ నెల 31న మరిడిమాంబ పండగ నిర్వహించనున్నారు. ఈ మేరకు పండగ చాటింపు అనంతరం ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాల ఊరేగింపు ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యులు పండగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోత దశకు గంటి సాగు



గరుగుబిల్లిలో గంటి పంట

కె.కోటపాడు: ఖరీఫ్ సాగులో భాగంగా వేసిన గంటి పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. అడపాదడపా కురిసిన వర్షాలతోపాటు నీటి లభ్యత ఉన్న వ్యవసాయ మోటారు, బావుల ఆధారంగా పంటకు తడులను రైతులు సకాలంలో అందించారు. తద్వారా పంట రెండు నెలల కాలానికి కోతదశకు చేరుకుందని చెబుతున్నారు. మార్కెట్‌లో గంటి పంటకు మంచి మద్దతు ధర ఉండటంతో సాగు లాభదాయకంగా ఉంటుందంటున్నారు. గరుగుబిల్లి, బత్తివానిపాలెం, కింతాడ, కె.సంతపాలెం, పాతవలస, కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట గ్రామాల్లో 130 ఎకరాల్లో సాగు చేపట్టారు.